# ఇదీ ప్రేమ కథే

తూర్పున రాబోయే సూర్యుణ్ణి తలుచుకుని సిగ్గుపడు తున్న ఆకాశ కన్య చెక్కిలి ఎర్రబారింది. వారి ప్రేమకలాపాన్ని స్వయంగా తిలకించాలని పక్షులు ఉత్సాహంగా తూర్పువైపు కిలకిలా రావాలతో ఎగురుకుంటూ వెళ్ళసాగాయి. మీ తాపాన్ని తగ్గించడానికి నేనున్నా నన్నట్లుగా చలిగాలి రివ్వున వీస్తోంది.

"ఉస్... దీనెమ్మ... ఏం చల్లా బగమంతుడా" ఇంకా ముడుచుకున్నాడు నర్సిగాడు. అయినా చలేస్తుంది. మోకాలు గడ్డానికి తాకుతుంది. ఇంక అంతకంటే ముడుచు కుని పడుకోడానికి సాధ్యపడదు. దుప్పటి నెత్తిమీదికి నిండుగా లాక్కున్నాడు. మరి నాగతేమిటి అన్నది బయటపడిన అతని ఒక్కగానొక్క కాలు. నర్సిగాడు ఎలా పడుకున్నాడో చూద్దామని చలిగాలి దుప్పటి చిరుగుల్లోంచి తొంగి చూస్తోంది. కుష్టువ్యాధి వేళ్ళని కొరుక్కు తినేసేట్టు చలిగాలి నర్సిగాడి శరీరం మొత్తాన్ని కొరుక్కు తినేస్తుంది.

"ఉస్ దీనెమ్మ..." మళ్ళీ గొణుక్కున్నాడు నర్సిగాడు. తనకు పరిచితమైన అడుగుల చప్పుడు వినిపించింది. దుప్పటి తలమీదినుండి తొలిగించకుండానే చిరుగులోంచి చూశాడు. రామి నడుంమీద చేతులుంచుకుని నర్సిగాడినే చూస్తోంది. అది అప్పుడే నిద్రలేచింది జుట్టు రేగిఉంది మూతి పక్కన తెల్లని

చారికలు. కళ్ళలో పుసులూ ఉన్నాయి. అదేసుక్కున్న జాకెట్టు కొత్తలో ఏరంగులో ఉండేదో చెప్పడం కష్టం. చీర కుచ్చెళ్ళు ఎత్తి బొడ్లో దోపుకుందేమో ఎడమ మోకాలు కనిపిస్తుంది. తలమీది దుప్పటి తొలగించి రామివైపు చూశాడు నర్సిగాడు.

"ఏంటే... అప్పుడే తెల్లారిందా?..." అన్నాడు.

"నువ్వు ముడుసుకు తొంగుంటే సూరీడు రాడేటి?... ముకం సూడు యదవ ముకం నువ్వూను. లేలే... కాస్సేపైతే కంపెనీలకి పోయేవాల్లు వత్తారు. ఇదేలైనా నీయబ్బ సోటేటి నీ యిట్టం వచ్చినంతసేపు తొంగోటానికి..." రామి వాడిమీది దుప్పటిలాగి ప్రక్కకి పారేసింది.

'ఈ యేడెట్టాగైనా సిన్న గుడిసేసోక్కోవాల' అనుకున్నాడు.

"ఏటాలోచిత్తన్నా?... బేగి లెగు కుంటెదవా... నువ్విట్టాసేత్తే రేపొద్దున్న నాక్కూడా తొంగోడానికి సోటుండదు. కొట్టు యజమాన్లు తిడ్తారు. లేరా..." రామి నర్సిగాడిని కాల్తో ఒక్క తాపుతన్ని అక్కడినుండి విసవిస వెళ్ళిపోయింది.

కాస్సేపు రామి వెళ్ళిన దిక్కుకే చూస్తూ కూర్చుండిపోయాడు.

'దొంగముండ... దీనికేం పొగర్రా నాయనా...' అనుకుని ప్రక్కనే ఉన్న కర్ర తీసుకుని చంకలకింద పెట్టుకుని లేచాడు. రేకుడబ్బాలలో ఉన్న పందుంపుల్ల తీసుకుని నోటిలో పెట్టుకుని సందు చివర ఉన్న బోరింగు పంపు దగ్గరికి వెళ్ళాడు.

అప్పుడు ఉదయం ఏడు గంటలు కావొస్తుంది. సూర్యుడు వెచ్చని ఎండని ప్రసరిస్తున్నాడు. నర్సిగాడు ముఖం కడుక్కుని వచ్చి తన దుప్పటి, రేకుడబ్బా ఓ చిన్న చిరుగుల బట్టల మూట ఓ మూలగా సర్దేశాడు. అది బస్సుస్టాపు కావడం మూలాన త్వరగా లేచిపోవాల్సి వచ్చింది నర్సిగాడికి. అప్పుడే కంపెనీల్లో పనిచేసేవారు వారి వారి కంపెనీ బస్సుల కోసం బస్సుస్టాపు కొచ్చి ఎదురుచూడసాగారు. నర్సిగాడు, రామి ఇద్దరూ పగలంతా అడుక్కుని రాత్రిపూట ఆ బస్సుస్టాపులో ఫుట్ పాత్ మీద షాపుల కెదురుగా పడుకుంటారు. రామి నర్సిగాడిమీద ఎప్పుడూ విరుచుకు పడుతుంది. నర్సిగాడికి ఇరవై ఏళ్ళుంటాయేమో. రామి నర్సిగాడికంటే అయిదా రేళ్ళు పెద్దది. అందుచేత వాడిమీద మరీ అధికారం చెలా యిస్తుంది. "కుంటెదవా... దొంగ సచ్చినోడా"...మొదలైన తిట్లతోనే వాడిని పిలుస్తుంటుంది. పాపం నోరులేని నర్సిగాడు అన్నీ భరిస్తుంటాడు. ఒక్కొక్కప్పుడు రామి కోపంతో రెచ్చిపోయి తిడుతుంటే వీడికెందుకో నవ్వొస్తుంది 'పిచ్చి ముండ... దీనికి నోటిదురుసెక్కువ...' అని అనుకుంటాడు తిట్టి తిట్టి చివరికి నర్సిగాడిని ఒక్కతాపు తన్ని అక్కడినుండి వెళ్ళిపోతుంది రామి.

అసలు నర్సిగాడికి రామికి పరిచయం విచిత్రంగా జరిగింది నర్సిగాఢు తను పెరిగిన ఊరువదిలి ఈ పట్నానికి వస్తే తనకు జరుగుబాటు బావుంటుందని తలచి ఒకరోజు ఉదయం అయిదు గంటలకు బయలుదేరి తన ఊరికి పదిహేను మైళ్ళ దూరంలో ఉన్న పట్నానికి కుంటుకుంటూ వచ్చేశాడు. పట్నం చేరేసరికి

మిట్టమధ్యాహ్నం 12 గంటలైంది. అంతకు ముందురోజు రాత్రి కూడా వాడికి ఎక్కడా పట్టెడు మెతుకులు దొరకలేదు. దానికి తోడు అంతదూరం ఎండలో తిరగడం మూలాన కళ్ళుతిరిగాయి సరిగ్గా ఇప్పుడుంటున్న బస్సు స్టాండు దగ్గర కళ్ళు తిరిగి పడి పోయాడు. తిరిగి కళ్ళు తెరిచేసరికి ఎదురుగా రామి ఉంది.

"ఏమైందివె?... ఒంటో బాగోనేదా?..." అదే రామి నర్సిగాడితో మాట్లాడిన మొదటి మాట.

"ఊహు...కాదు...ఆకలి..." అన్నాడు నర్సిగాడు.

"ఓర్నియమ్మ...ఆడదాన్నాగ ఇంత సిన్నదానికే కళ్ళు తిరిగి పడిపోయావే..." గట్టిగా నవ్వింది రామి. దాని గొంతు అరిగిపోయిన గ్రామఫోను రికార్డులాగా గరగరమంటుంది.

నర్సిగాడు తలవంచుకున్నాడు. రామివాడి ముఖంమీద చల్లిన నీళ్ళు బొట్లు బొట్లుగా ముక్కు, గడ్డం కొనలనుండి క్రిందికి జారుతున్నాయి.

"మనం ఉండేదెక్కడా?..." రామి వాడి ముఖంలోకి చూస్తూ ప్రశ్నించింది.

"పాలెంకాడ.." ఇంకా తలవంచుకునే ఉన్నాడు వాడు.

"ఇప్పుడక్కడి నుండి నడ్సుకొచ్చావా?"... కళ్ళు పెద్దవిచేసి అడిగింది. ఊడూ బసవన్నలా తలాడించాడు వాడు.

"అద్గదీ సంగతి... ఎండలో అంత దూరం నుండి నడుసుకొత్తే కల్లు తిరగవ్వూమరి?... పద కాసింత కూడు తిందూ

గాని..." అంటూ వాడికి చెంకల కింది కి కర్ర అందించి లేచి నిలబడింది రామి.

బస్సు స్టాపు ఎదురుగా రోడ్డుకవతల ఉన్న చెట్టుకిందికి చేరా రిద్దరూ

"నీ పేరేమిటి?..." మట్టిచిప్పలో అన్నం పెడుతూ అడిగింది రామి.

"నర్సయ్య..."

"నా పేరు రామి" అంది తనుకూడా సిల్వరుగిన్నెలోని అన్నం కలుపుతూ.

కాదు .. దేవత! అనుకున్నాడు నర్సిగాడు ముద్దనోటిలో పెడుతూ.

"అవునుగానీ నీకాలెట్టాపోయింది?... ఏ లారీ అయినా గుద్దేశినాదేటి?" ఎవరికైనా కాళ్ళుగాని, చేతులుగానీ లేకపోతే అవి లారీ యాక్సిడెంటులోనే పోయుండాలని రామి గట్టిగా నమ్ముతుంది. ఎందుకంటే ఇదివరలో ఇలానే కాళ్ళులేని వాళ్ళని ఇద్దరు ముగ్గుర్ని అడిగితే వాళ్ళులారీ యాక్సిడెంటు లోనే పోయిందని చెప్పారు.

"లేదు..." రామి ప్రశ్నకు సమాధానం చెప్పాడు నర్సిగాడు.

"మరి?..."

"మాయమ్మా నాన్నా నాకాత్రియించిసేరు... అట్టా

గయితే నన్నుసూపి ఒద్దే డబ్బులుఅడుక్కోక పచ్చేని"...నర్సిగాడు ఎడమచేత్తో కళ్ళు తుడుచుకున్నాడు.

'అరి దొంగ సచ్చినాళ్ళారా... కన్న కొడుకు కాళ్ళిరిసే డానికి అళ్ళకి సేతులెలా వచ్చాయ్...' గడ్డం కింద చెయ్యిపెట్టి కళ్ళింతింతచేసి చూసింది రామి

'అళ్ళు మాయమ్మా నాన్నా కారు... సిన్నప్పటినుండీ నన్ను పెంచినారు... అందుకే అట్టా అమ్మానాన్న అని పిలుత్తాను...'

'మరి మీ అమ్మా నాన్నా ఓరు?...'

'నాకు తెల్దు...'

"మరి నిన్ను పెంచుకున్నోరెరి?..."

"సచ్చిపోనారు... పాలెంలో ఓరోజు రోడ్డు పక్కనున్న సత్రం గట్టుమీద మేం తొంగుంటే అర్ధరాత్రేల లారీకి బ్రేకులు సెడిపోయి సత్రానికి గుద్దించేసేడు. అమ్మా నాన్నా దానికింద పడ్డి సచ్చిపోనారు..."

'మరి నీ కేటీ కాలేదూ?...'

'ఆ యాలప్పుడు నాను ఒంటేలు కెల్లా...' చిటికెనవేలు చూపిస్తూ సిగ్గుపడ్డాడు నర్సిగాడు.

గట్టిగా నవ్వింది రామి. వాడి కథకు జాలిపడి తన కోసం దాచుకున్న పచ్చడి బద్ద వాడికేసింది.

"నీకెవరూ లేరా?..." అని అడిగాడు నర్సిగాడు.

'లేదు... నేను పుట్టగానే నాన్న సచ్చాడు. ఆనక అమ్మ పనిసేసే యింటిలో ఏదో దొంగతనం సేత్తే జైల్లో ఎట్టేసేరు. అప్పుడు నాకు పదేళ్ళుంటాయి. అప్పట్నుంచీ ఇలా బస్సుస్టాండును నమ్ముకుని బతుకుతున్నా .. తిరిగి మా యమ్మ రానేదు... ఎవడితో పోయిందో ఏటో?!...'

రామి మళ్లీ గట్టిగా నవ్వింది. కళ్లలో నీళ్ళు నిలిచాయి. నర్సిగాడికి జాలేసింది. రామి యిచ్చిన పచ్చడి బద్దను సగానికి కొరికి రామి గిన్నెలో వేశాడు.

ఆరోజు రాత్రి ఎక్కడ పడుకోవాలో రామి నర్సిగాడికి చూపించింది. రాత్రి ఇళ్ళన్నీ తిరిగి అడుక్కుని వచ్చిన అన్నం తిన్నాడు. రామి అప్పటికి ఇంకా రాలేదు. రాత్రి పదైంది. కొట్లన్నీ కట్టేశారు. ఎక్కడా జనసంచారం లేదు. రామి ఎక్కడికెళ్ళిందో అనుకుంటూ మార్వాడీ కొట్టుమీద పడుకున్నాడు. పొద్దున్న నడచిన బడలికవల్ల వెంటనే నిద్ర పట్టేసింది.

ఉన్నట్లుండి ఉలిక్కిపడి లేచాడు. రామి కాల్తో నర్సిగాడిని తంతోంది.

"నీకు వేరే జాగా సూపిత్తే ఈడ పరుండావేం?... ఇది నా జాగా... లేరా నమ్మీకొడకా...లే...'' వాడి జుట్టు పట్టుకుని లేవదీసింది. మధ్యాహ్నం రామిని దేవత అని అనుకున్న నర్సిగాడు ఇదెక్కడో రాచ్చసిలాగుందే అనుకున్నాడప్పుడు.

ఒకరోజు ఎక్కడినుండో ఒక చంటిబిడ్డని చేతలో వేసుకునొచ్చి అడుక్కోవడం మొదలుపెట్టింది రామి.

"ఈ డె వ డు ?...'' నర్సిగాడు ఆశ్చర్యంగా చేటలోని పిల్లాడివంక చూశాడు.

"ఈడు నా కొడుకు కాదులే...' నవ్వింది రామి. "ఈడిని తూర్పిదిలోని సుక్కమ్మ దగ్గరనుండి ఎట్టుకొచ్చా... ఈడిమీద సంపాయించిన డబ్బులో నాలగోవాటా సుక్కమ్మకు ఇవ్వాల. నీకైతే బాగా సంపాయించుకోడానికి కుంటి కాలుంది. మరి నాకేటుంది... అందుకనే ఈడినెట్టుకొచ్చా..."

నర్సిగాడు నోరు తెరుచుకుని వింటున్నాడు.

'నీకేటి లేకపోవడమేటే రామి... నువ్వు సంపాయించాలనుకుంటే నానా సంపాయించగలవ్...' అన్నాడు అక్కడే ఉన్న రిక్షారంగడు చిరుగుల రవికెలోంచి తొంగిచూస్తున్న రామి గుండెలకేసి చూస్తూ.

'థూ నీయమ్మ... అట్టా నీయమ్మని సెల్లిని సంపాయించమన్నా నంజికొడకా...'

అంతే రంగడినోట మాట రాలేదు. అక్కడికి రిక్షా వాళ్ళు రామితో మొదటిలో ఇలానే సరసాలు ఆడేవారు. అది వాళ్ళకి చెప్పుతీసుకొని కొట్టినట్టు సమాధానం చెప్పేది. ఒక్కొక్కప్పుడు తన్నడానికి మీదికి వెళ్లేది. అందుకనే దానికి జడిసి వాళ్ళు కాస్త అదుపులో ఉంటారు. దానితో రిక్షా రంగడు కూడా ఎక్కువ పరాచికాలు ఆడ్తాడు... ఎక్కువ తిట్లుకూడా తింటాడు.

'ఎంత తిడ్తేనేం ఎదవ బతుక్కి సిగ్గూసెరమూ ఉంటేగా' అంటుంది రామి.

మొదట్లో నర్సిగాడికి రామి ప్రవర్తన ఏమాత్రం అర్థమయ్యేదికాదు. నవ్వుతూ మాట్లాడుతూ అంతలోనే బండబూతులు తిడుతుండి. "నువ్వు రాక ముందు ఈ బస్సుస్టాండు కాడ నానొక్కత్తినే హాయిగా బతికేదాన్ని... ఇప్పుడు నువ్వొకడివి నాకు పోటీగా..." అని అప్పుడప్పుటూ నర్సిగాడి మీద విసుక్కుంటుంది. కానీ ఈ సంవత్సర కాలంలో రామి పూర్తిగా అలవాటైపోయింది నర్సిగాడికి. అదేమన్నా పట్టించుకోడు. ప్రొద్దున్న చెరోదిక్కూ అడుక్కోడానికి వెళ్ళిపోతారు. మధ్యాహ్నం చెట్టుక్రింద కలిసి అన్నం తింటారు. రాత్రిదాకా బస్సుస్టాండులో పైసలు అడుక్కుంటారు. తరువాత మళ్ళీ అడుక్కుతిని రాత్రి షాపులన్నీ కట్టేసి, నిర్మానుష్యమయిపోయిన తరువాత ఫుట్‌పాత్‌కి ఆనుకుని ఉన్న షాపు గట్లమీద నిద్రపోతారు... ఇదీ వారి దినచర్య.

'ఏరా కుంటోడా... ఇంకా ఇక్కడే ఉన్నావా?...' అంటూ అక్కడికి వచ్చింది రామి.

'ఇప్పుడే ఎల్దామనుకుంటున్నా...' అన్నాడు నర్సిగాడు చెంకలకింద కర్రలు చేర్చుకుని, జోలె బుజానికి తగిలించుకుంటూ

అప్పటికి కంపెనీల్లో పనిచేసే వారందరూ వెళ్ళిపోయారు. ఇప్పుడు రకరకాల డ్రస్సులతో ఉన్న స్కూలు పిల్లలతో ఆ బస్సుస్టాపు కళకళలాడుతుంది. కాస్సేపైతే వాళ్ళు కూడా వెళ్ళిపోతారు. తరువాత కాలేజీలకి ఆఫీసులకి వెళ్లే వారితో మహారద్దీగా ఉంటుంది ఆ స్థలం. అన్నం అడుక్కోడానికి వెళ్ళిన ఇద్దరూ ఆ సమయానికి బస్సుస్టాపుకి వచ్చేసి డబ్బులు అడుక్కుంటారు. ఆఫీసులకు వెళ్లేవారందరూ వెళ్ళి

పోయి బస్సుస్టాపు ఖాళీ అయిపోతే మళ్ళీ అన్నం అడుక్కోడానికి వెళతారు. లేదా అప్పటికే కావలసినంత అన్నం దొరికితే ఇంక అక్కడే ఉండిపోతారు.

'నా నెల్లొస్తారా నర్సిగా...' రామి చెంకన జోలె తగిలించుకుని వెళ్ళిపోయింది. నర్సిగాడు కూడా నెమ్మదిగా కుంటుకుంటూ మరోదారి పట్టాడు. ఆరోజు వారికి ఎవరూ అన్నం వెయ్యడంలేదు.

'అమ్మా... కాస్త అన్నం వెయ్యితల్లీ...'

అరుస్తూ ఇంటింటికీ తిరుగుతున్నాడు. పది గంటలై పోయింది. అప్పుడు బస్సుస్టాపు జనంతో కిటకిటలాడుతుంది. అయినా నర్సిగాడికి వెనక్కు పోబుద్ధికాలేదు. వెనక్కు వెళ్ళి డబ్బులు అడుక్కుని మళ్ళీ అక్కడిదాకా అన్నంకోసం వచ్చే ఓపిక వాడికి లేదు. అప్పటికే బస్సుస్టాపునుండి చాలాదూరం వచ్చేశాడు. ఇంకోగంట ఓపిగ్గా తిరిగాడు. వాడికి ఒంటిలో సత్తువ పోయింది. గొంతు తడారిపోయింది. ఎవరైనా అన్నం వేస్తారన్న ఆశ పోయింది. వెనక్కి తిరిగిపోతే?... ఆ రామే ఏదోఒకటి పెడ్తుంది. అనుకున్నాడు అనుకున్నదేతడవుగా వెనక్కు తిరిగాడు.

'ఏయ్ అబ్బి...' ఆవిడ గుమ్మంలోంచి పిలుస్తోంది. నర్సిగాడికి ఎక్కడలేని ఓపిక వచ్చింది. చంకల కింది కర్రలు టకటకలాడిస్తూ గబగబా ఆమె దగ్గరికి వెళ్ళి జోలె పట్టాడు వాళ్ళింట్లో అన్నం బాగా మిగిలినట్లుంది. తనకి రాత్రికికూడా సరిపోయినంత వేసిందావిడ ఒకసారి చెయ్యెత్తి ఆమెకు నమస్కరించి బస్సుస్టాపు వైపు దారితీశాడు నర్సిగాడు.

బస్సుస్టాండు అంతదూరం ఉండగానే రామి గొంతు కంచుకంఠంలా వినిపిస్తుంది నర్సిగాడికి. బస్సుస్టాపులో జనం గుంపుగా మూగిఉన్నారు. రామి కంఠంనుండి బూతులు విన్పిస్తున్నాయి. చుట్టూ మూగిన జనం విరగబడి నవ్వుతున్నారు. ఏదో గొడవ జరిగినట్లు పసిగాట్టాడు నర్సిగాడు గబగబ కుంటు కుంటూ గుంపుని చేరుకున్నాడు.

"దొంగనాయలా .. నా సెయ్యట్టుకుంటావ్‌రా పుండాకోర్... నీయమ్మ... దొంగలం..." ఆ వాక్ప్రవాహానికి అడ్డులేదు రంగడు రామిముందు నేరస్థుడిలా నిలుచున్నాడు.

నర్సిగాడిని చూడగానే రామి మరింత రెచ్చిపోయింది.

"మీ మగజాతెలాటిదో సూడ్రా కుంటెదవా... ఈ దొంగలం... నువ్వెళ్ళి ఆడి పెళ్ళాం సెయ్యట్టుకోరా..."

"ఒసేయ్ నంజా... మాటలు తిన్నగా రానియ్..." రంగడు పౌరుషంగా అన్నాడు

'ఏట్రా కూశావ్?...' రామి సర్రున ముందుకు దూకి రంగడి జుట్టుపట్టి పీకి ముఖంమీద కాండ్రించి ఉమ్మేసింది.

'ఒసేయ్... నీ అంతు చూస్తానే ..' పిడికెళ్ళు బిగించి ముందుకు ఉరికాడు రంగడు. వేరే రిక్షావాళ్ళు వాడి రెండు రెక్కలూ గట్టిగా పట్టుకుని ఆపారు.

"ఆడకూతుర్తో నీకేటి?... అయినా ముందు దాని జోలికి నువ్వెందుకెళ్లాల." అన్నారు.

రంగడు ముఖంమీద ఉమ్మును చొక్కాతో ఎత్తితుడుచు

కున్నాడు. తనతోటి రిజావాళ్లందరూ తనని చూసి నవ్వడంతో వాడిగుండెలు భగ్గున మండాయి.

'ఒసేయ్... నీ అంతు చూస్తానే... కాస్కో...' అంటూ ఓ రంకె వేసి అక్కడినుండి రిజా తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు రంగడు.

నర్సిగాడు, రామి ఇద్దరూ చెట్టు నీడన చేరారు.

"నాకీయాల అన్నం దొరకలే..." అంది రామి.

'పర్లేదు... నాదగ్గర శానా ఉంది గిన్నట్టు'

అన్నం ఇద్దరికీ పంచాడు నర్సిగాడు. రామి అన్నం సరిగ్గా తినడం లేదు. వేలితో బొచ్చెలో ఊరికే కెలుకుతుంది.

'అన్నం తిను... ఊరికే కెలుకుతావేం?... రంగడి మాటలకు జడుసుకున్నావేటి?... నీకేంభయంనేను... నా నున్నాను'

'శ... ఆడో కుక్క... ఆడికి జడువేటి?... అయినా కుంటోడివి నువ్వునాకు దైర్నం సెప్తున్నావా?...' అన్నది రామి విసురుగా. నర్సిగాడు మరేం మాట్లాడలేదు. గబగబ బొచ్చె ఖాళీ చేసేశాడు.

'నాకు తినాలని లేదు... నువ్వేతిను...' తన బొచ్చె లోది కూడా నర్సిగాడి గిన్నెలోకి వొంపేసి చెయ్యికడుక్కుంది రామి. నర్సిగాడు ఆశ్చర్యంతో రామివంక చూశాడు.

ఆ రోజంతా రామి చాల ముభావంగా ఉంది. అస్సలు ఏమీ మాట్లాడడంలేదు, పైసలు కూడా ఎవ్వరినీ అడగడం

లేదు. ఏదో ఆలోచిస్తూ ఉంది. రామిని అట్లాగ వాడెప్పుడూ చూడలేదు. ఎందుకో రామిని అలా చూస్తుంటే వాడికి ఏడు పొస్తుంది. రామి తనని బూతులు తిట్టినా పరవాలేదు గానీ అస్సలు మాట్లాడకుండా ఉండడం వాడికి భరించరానిదిగా ఉంది. రాత్రి కూడా అన్నం వద్దంది. నర్సిగాడి బలవంతంమీద కాస్త తిని పడుకుంది. నర్సిగాడు కూడా ఓ గట్టుమీద నడుం వాల్చాడు. వాడికి వెంటనే నిద్ర పట్టేసింది. రామికి మాత్రం ఆలోచనల వల్ల నిద్ర పట్టలేదు, అలా కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ పడుకుంది. అర్ధరాత్రి ఎవరో చెయ్యేసే సరికి ఉలిక్కిపడి కళ్ళు తెరచి చూసింది రామి రంగడు రామి ముఖంమీద ముఖంపెట్టి చూస్తున్నాడు. రామి అరవబోయింది. రంగడు వెంటనే రామి నోరు నొక్కేశాడు.

"దొంగనంజా...నన్ను బూతులు తిడ్తావా?...సెయ్యేట్టుకోగానే అరిగిపోతావా అంత అల్లరి సేశావ్?...ఇప్పుడు నిన్నేం సేత్తానో సూడు..."

రామి గింజుకుంటుంది. రంగడు రామిమీదికి ఎగబ్రాకాడు. వాడిని కాల్తో తన్నబోయింది రామి. అందుకు అవకాశం ఇవ్వకుండా రామి కాళ్ళను తన కాళ్ళతో తొక్కిపట్టాడు రంగడు. వాడి చెయ్యి రామి నిండుగుండెలమీద తచ్చాడుతుంది. తన నోరు నొక్కి పట్టిన రంగడి కుడిచేతిని గట్టిగా కొరికింది రామి.

"అబ్బా.. సంపేసేవే దొంగముండా... ఉస్,..." చెయ్యి విదిలించాడు. ఒక్కసారిగా పౌరుషంతో విజృంభించాడు రంగడు. రామి చీరతో తంటాలు పడుతున్నాడు.

'ఒరేయ్ నర్సిగా... కుంటోడా... ఒరేయ్ .' రామి గావుకేకలు పెట్టింది

చీరను వదిలి మళ్ళీ రామి నోరు మూశాడు రంగడు. రామి కేకలకు నర్సిగాడికి మెలకువ రానే వచ్చింది. తనకి పది గజాల దూరంలో మార్వాడీ షావు గట్టుమీద చీకటిలో పొర్లు తున్న ఆకారాలు చూసి గబుక్కున లేచాడు.

రామిలో ఇంక ప్రతిఘటించే శక్తి పోయింది అయి పోతుంది... రంగడు దాన్ని పూర్తిగా ఆక్రమించేయ బోతు న్నాడు. రామి... రామి. తనకు ఇన్నాళ్ళకు... రంగడు ఉత్సాహంగా ముందుకు ప్రాకాడు. రామి ఆశ వదులుకుంది.

అంతే!... పెద్దగావుకేక పెట్టి రంగడు వెనక్కి విరుచుక పడ్డాడు. వాడి తలకాయ ఎండాకాలం గాలెక్కువైన సైకిల్ టైరులా పేలింది. రామి గబుక్కున లేచి కూర్చుని చీర క్రిందికి లాక్కుంది. నర్సిగాడు విజృంభించి తన చంకల కింది కర్రలతో రంగడిని గొడ్డును బాదినట్లు బాదుతున్నాడు. వాడికి తిరగబడే అవకాశమే ఇవ్వడం లేదు. రంగడు బాధను భరించలేక అరుస్తున్నాడు. రామి నర్సిగాడిని పట్టుకుని ఆపింది.

'ఆడ్ని వదిలెయ్...సావగల్డు...' అంది. రంగడు పరుగు లకించుకున్నాడు.

'నువ్వాపక పోయుంటే ఆడ్ని సంపేసుండేవోడ్ని...' నర్సిగాడు వగరుస్తున్నాడు. నర్సిగాడిని ఆ విధంగా ఎప్పుడూ చూడలేదు రామి. వాడికి అంత ఆవేశం వస్తుందని కూడా అది ఊహించలేదు.

నర్సిగాడు ఇంకా గొణుక్కుంటూనే తన పక్కమీద పడుకున్నాడు. రామి వచ్చి వాడి ప్రక్కన పడుకుంది. నర్సిగాడు ఆశ్చర్యంతో పక్కకి తిరిగి చూశాడు. రామి కళ్ళల్లో నీళ్ళు!!...

''ఏం భయపడకు...నే నున్నాను గదేటి''...కన్నీళ్ళు తుడిచాడు.

రామివాడికి దగ్గరగా జరిగి గట్టిగా పట్టుకుని కాస్సేపు పడుకుంది. నర్సిగాడికి ఏదో హాయి అనిపించింది. కాస్సేపైనాక "నువ్వు శానా మంచోడివిరా..." అంది. నర్సిగాడు సంబరపడిపోయాడు. రామి నర్సిగాడిని ముద్దుపెట్టుకుంది. చిన్న పిల్లల్ని ముద్దుపెట్టుకోవడం తెలుసుగానీ, ఇలా పెద్దవాళ్ళు, అందులో ఆడవాళ్ళు మగవాళ్ళని ముద్దుపెట్టుకోవడం గురించి వాడికి తెలీదు. వాడికెంతో కొత్తగా అనిపించింది.

''నే నెల్లి నా సోట్లో పరుంటాను...'' రామి లేవబోయింది.

'ఉహు ..' నర్సిగాడికి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. రామిని రెండు చేతుల్తో పట్టుకుని కదలనివ్వలేదు.

'ఈడే... నీ పక్కనే తొంగోనా...?'

అవునన్నట్లు తలూపాడు నర్సిగాడు. ఉన్నట్లుండి ఎక్కడ లాగి లెంపకాయ కొడ్తుందో నన్న భయం కూడా వాడి మనసులో లేకపోలేదు,

''మరి మనం ఇలా పడుకుంటే ఎవరైనా సూత్తే...?

బుర్ర గోక్కున్నాడు నర్సిగాడు.

'మనకో గుడిసె కావాల...' మళ్ళీ రామే అంది.

నర్సిగాడు మాట్లాడలేదు.

'మనం గుడిసె కట్టుకుందామా?...

'నా దగ్గర అంత డబ్బునేదే?...' నర్సిగాడు గొణిగాడు

"నా దగ్గరుంది...దాంతో కట్టుకుందాం...

నర్సిగాడు రామివంక నమ్మలేనట్లు చూశాడు.

"నన్ను మనువాడ్తావా? .." రామి వాడికి దగ్గరగా జరుగుతూ అంది.

ఈ సారి వాడికి నిజంగానే మతిపోయింది. ఆశ్చర్యంతో రామివంక చూశాడు.

"నిజంరా... నిన్ను తిట్టాను... కొట్టాను కూడా. . కానీ మనువయితే అట్టా వుండను... అప్పుడు నువ్వు నాకు మొగుడివి కదా?... నిన్నేటీ అనను. నువ్వు సెప్పినట్టు ఇంటాను నన్ను సేస్కుంటావా?..." రామి సిగ్గుపడింది. బహుశా అది సిగ్గు పడటం ఇదే మొదటి సారేమో. నర్సిగాడికీ రామి కొత్తగా అనిపించింది. ఒక్కక్షణం రామి ముఖంలోకి చూశాడు.

"రామీ... నువ్వు దేవతవే..." గట్టిగా రామిని వాటేసుకున్నాడు.

జూన్, 1980 యువ